కోదాడ : బాలాజీనగర్‌లో ఎన్నికల సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్ వెంకట్రావ్, చిత్రంలో ఎస్పీ రాహుల్ హెగ్డే

నేడే పోలింగ్

లోక్ సభ ఎన్నికలకు సర్వం సిద్ధం

- ఉదయం 7నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓటింగ్
- ఉదయం 5.30 గంటలకు మాక్ పోలింగ్
- 2,061 పోలింగ్ కేంద్రాలు,.. 17,25,465 మంది ఓటర్లు
- నల్లగొండ బరిలో 22 మంది అభ్యర్థులు
- పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సామగ్రి, సిబ్బంది
- సమస్యాత్మక కేంద్రాల వద్ద ప్రత్యేక చర్యలు
- ఓటు వేసేందుకు గుర్తింపు కార్డు తప్పనిసరి
- పకడ్బందీగా నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి : కలెక్టర్ హరిచందన
- ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత పోలింగే లక్ష్యం : ఎస్పీ చందనా దీప్తి

నల్లగొండ ప్రతినిధి, మే12(నమస్తే తెలంగాణ) : లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. సోమవారం ఉదయం 7గంటల నుంచి మొదలయ్యే పోలింగ్ కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. పోలింగ్ విధుల్లో పాల్గొనే సిబ్బంది సామగ్రితో ఆదివారం సాయంత్రానికే తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఆయా నియోజకవర్గాల డిస్ట్రిబ్యూటరీ కేంద్రాల్లో వీరందరికీ ర్యాండమైజ్ పద్ధతితో విధులు కేటాయించారు. వీరంతా సోమవారం ఉదయం ఆయా అభ్యర్థుల పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహిస్తారు. అనంతరం ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ షురూ చేసి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుపనున్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛాయుత వాతావరణంలో వినియోగించుకునేలా చర్యలు తీసుకున్నట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. కాగా

10వేల మంది పోలింగ్ సిబ్బంది

పోలింగ్ విధుల కోసం దాదాపు 10వేల మంది పైచిలుకు సిబ్బందిని వినియోగిస్తున్నారు. పోలింగ్ స్టేషన్ వారీగా ఒక్కో బృందం చొప్పున 2,061, రిజర్వ్‌లో మరో 374 బృందాలుగా సిబ్బంది విధుల్లో ఉన్నారు. వీరితో పాటు మైక్రో అబ్జర్వర్లుగా 326 మంది, 2,061 మెడికల్ బృందాలు, 1,444 మంది వలంటీర్స్ సేవలు కూడా వినియోగించుకుంటున్నారు. వీరు కాకుండా 3వేల మందికి పైగా పోలీసు సిబ్బంది బందోబస్తు విధుల్లో ఉన్నారు. వీరిలో ఇద్దరు ఏఎస్పీలు, 9మంది డీఎస్పీలు, సీఐఈలు 37 మంది, ఎస్‌ఐలు 84 మందితో కలిపి మొత్తం 3వేల మందితో పాటు ఏడు కంపెనీల కేంద్ర బలగాలు విధుల్లో ఉన్నాయి. ఇంకా 5 ప్లాటూన్ల టీఎస్‌ఎస్‌పీ సిబ్బంది, పెట్రోలింగ్ పార్టీలు, క్విక్ రియాక్షన్ టీమ్స్, స్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది కూడా ఉన్నారు. వీరంతా ఆదివారం ఉదయమే తమ విధుల్లో నిమగ్నమయ్యారు.

నల్లగొండ డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో పోలింగ్ సామగ్రిని సిద్ధం చేసుకుంటున్న సిబ్బంది

365 సమస్యాత్మక కేంద్రాలు

నల్లగొండ స్థానంలో 244 ప్రాంతాల్లో 365 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించారు. వీటి పరిధిలోనే దేవరకొండ నియోజకవర్గంలో 13 షాడో పోలింగ్ కేంద్రాలు అదనంగా ఏర్పాటు చేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై నిరంతర నిఘా ఉంటుంది. అన్ని పోలింగ్ కేంద్రాల్లో లైవ్ వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశారు. 365 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల నుంచి సీసీ టీవీలతో పర్యవేక్షణతోపాటు ప్రత్యేక పోలీసు బలగాలతో బందోబస్తు నిర్వహిస్తారు.

నల్లగొండ లోక్‌సభ స్థానంలో మొత్తం 22 మంది అభ్యర్థులు బరిలో ఉండగా 2,061 పోలింగ్ కేంద్రాల్లో 17,25,465 మంది ఓటర్లుగా నమోదై ఉన్నారు. మరోవైపు ఇన్నాళ్లు విస్తృత ప్రచారం నిర్వహించిన ప్రధాన పార్టీల అభ్యర్థులంతా శనివారం రాత్రి నుంచి పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి సారించారు.

నల్లగొండ పార్లమెంట్ స్థానంలో 17.25 లక్షల మంది ఓటర్లు

నల్లగొండ లోక్‌సభ స్థానంలో 17,25,465 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 8,44,843 మంది, మహిళలు 8,80,453 మంది, 169 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. 739 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారు. ఇక వయస్సుల వారీగా పరిశీలిస్తే... 18–19 సంవత్సరాల మధ్య ఓటర్లు 61,143 మంది, 85ప్లస్ సీనియర్ సిటిజన్స్ 9592 మంది, దివ్యాంగులు 33,890 మంది, ఓవర్ సీస్ ఓటర్లు 161 మంది ఉన్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. కాగా 2,029 పోలింగ్ కేంద్రాలు, 32 యాక్జిలరీ పోలింగ్ కేంద్రాలు కలిపి మొత్తం 1,435 ప్రాంతాల్లో 2,061 కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో గ్రామీణ ప్రాంతాల్లో 1,556, పట్టణ ప్రాంతాల్లో 505 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఈ ఎన్నికల్లో మొత్తం 22 మంది అభ్యర్థులు బరిలో నిలువగా రెండు బ్యాలెట్ యూనిట్లను వినియోగించనున్నారు. ఇప్పటికే పోలింగ్ విధుల్లో పాల్గొంటున్న సిబ్బందిలో 16,143 మంది పోస్టల్ బ్యాలెట్‌తో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

మోడల్ పోలింగ్ కేంద్రాలు

ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఐదు చొప్పున ప్రత్యేకంగా మహిళా సిబ్బందితో నిర్వహించే పోలింగ్ కేంద్రాలు మొత్తం 35 ఉన్నాయి. అలాగే నియోజకవర్గానికి ఐదు చొప్పున మొత్తం 35 మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి నియోజకవర్గంలో ఒకటి చొప్పున వికలాంగ సిబ్బంది, మరొకటి యువత నిర్వహించేలా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాలను పెట్టారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు, మెడికల్ కిట్స్, వలంటీర్స్, ట్రాన్స్‌పోర్ట్, క్యూ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్ ఏర్పాటు చేశారు.

ఓటేద్దాం రండి!

మన ఇంటి చుట్టూ ఉన్న గల్లీ స్థాయి పాలకులనే కాదు.. దేశ రాజధాని ఢిల్లీలో కూర్చొని మనల్ని పాలించే పరిపాలకులను సైతం మనమే నిర్ణయించే వజ్రాయుధం ఓటు మాత్రమే. అలాంటి ఓటు హక్కును ఈ రోజు ఉపయోగించకుండా వృథా చేయొద్దు. 'ఆ అంతదూరం ఏం వెళ్తాం లే..' అనే నిస్పృహను దరిచేరనివ్వద్దు. 'నా ఒక్క ఓటుతో ఒరిగేదేముంది' అనే అలసత్వం అసలే వద్దు. ఒక్కోసారి నీ ఒక్క ఓటే విజేతను తేల్చవచ్చు. నచ్చిన అభ్యర్థికి నిష్పక్షపాతంగా ఓటేద్దాం. ప్రతి ఒక్కరం ఓటేస్తేనే భారత ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది. దేశానికి అవసరమైన పాలకుల ఎంపిక ఫర్‌ఫెక్ట్‌గా జరుగుతుంది. అందుకే ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరం ఓటేద్దాం రండి..!

పోలింగ్ అనంతరం స్ట్రాంగ్ రూమ్స్‌కు

సాయంత్రం 6 గంటలకు పోలింగ్ ముగిసిన తర్వాత ఈవీఎంలను తిప్పర్తి మండలం అనిశెట్టి దుప్పలపల్లిలోని స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోదాముల్లోని స్ట్రాంగ్ రూమ్స్‌కు తరలించనున్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల నుంచి ముందుగా డిస్ట్రిబ్యూటరీ/రిసిప్షన్ కేంద్రాలకు అన్ని ఈవీఎంలు వచ్చాక అక్కడి నుంచి భారీ బందోబస్తు నడుమ గోదాములకు తరలిస్తారు. అక్కడ ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్స్‌లో వీటిని భద్రపరచనున్నారు. వచ్చే నెల 4వ తేదీన ఇదే గోదాములో ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

ఓటింగ్‌కు తరలిరండి : దాసరి హరిచందన, నల్లగొండ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్

ఓటర్లంతా స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఓటర్లంతా ఓటింగ్‌కు తరలివచ్చి ప్రజాస్వామ్య స్ఫూర్తిని నిలబెట్టాలి. ఎండలు మండినా, వర్షం కురిసినా ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఏదో ఓ సమయంలో ఓటు హక్కు వినియోగించుకోండి. ప్రతి ఒక్కరూ ఓటు వేసేందుకు ఓటరు స్లిప్పుతోపాటు ఎన్నికల సంఘం సూచించిన ఏదో ఒక గుర్తింపు కార్డును తమ వెంట తెచ్చుకోండి.

గుర్తింపు కార్డు తప్పనిసరి

ఓటు వేయడానికి గుర్తింపు కార్డు తప్పనిసరి. ఫొటో ఓటర్ గుర్తింపు కార్డు(ఎపిక్ కార్డ్), ఆధార్ కార్డు, ఉపాధి హామీ జాబ్ కార్డు, బ్యాంకు/తపాలా పాస్ బుక్, కార్మిక శాఖ ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డ్, భారతీయ పాస్‌పోర్ట్, ఫొటో గల పెన్షన్ పత్రాలు, కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వాలు/పీఎస్‌యూలు/పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు జారీ చేసిన ఉద్యోగ గుర్తింపు కార్డులు..ఇలా ఫొటో కూడిన గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి ఓటరు వెంట తీసుకెళ్లాల్సిందే.

నిర్భయంగా ఓటు వేయాలి : చందనా దీప్తి, ఎస్పీ నల్లగొండ

పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు భద్రత పరంగా అన్ని రకాల చర్యలు తీసుకున్నాం. కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశాం. ప్రతి ఓటరూ స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలి. ప్రలోభాలకు గురికాకుండా ప్రజలంతా నిష్పక్షపాతంగా ఓటు వేయాలి. పోలీసులకు సహకరించాలి. వారి సూచనలు పాటించాలి. ప్రశాంత పోలింగ్‌కు తోడ్పాటు నందించాలి.

మిర్యాలగూడ నుంచి ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు తరలుతున్న సిబ్బంది

నల్లగొండలో..

సూర్యాపేటలోని ఓ పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది

సూర్యాపేట నుంచి బస్సులో పోలింగ్ కేంద్రాలకు తరలుతున్న సిబ్బంది

భువనగిరి పార్లమెంట్ పరిధిలో 18,08,585 మంది ఓటర్లు

- ఎన్నికల బరిలో 39 మంది అభ్యర్థులు
- ఏడు నియోజకవర్గాల్లో 2,141 పోలింగ్ బూత్‌లు

యాదాద్రి భువనగిరి, మే 12 (నమస్తే తెలంగాణ) : భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో భువనగిరి, ఆలేరు, జనగాం, తుంగతుర్తి, నకిరేకల్, మునుగోడు, ఇబ్రహీంపట్నం అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఎన్నికల బరిలో 39మంది అభ్యర్థులు ఉన్నారు. మొత్తం 18,08,585 మంది ఓటర్లున్నారు. ఇందులో పురుషులు 8,98,98,416, మహిళలు 9,10,090, ఇతరులు 79మంది ఉన్నారు. ఇబ్రహీంపట్నం అసెంబ్లీ నియోజకవర్గంలో అత్యధికంగా 3,39,341మంది ఓటర్లు ఉన్నారు. ఆ తర్వాత వరుసగా మునుగోడులో 2,57,557, భువనగిరిలో 2,20,596, నకిరేకల్‌లో 2,53,785, తుంగతుర్తిలో 2,59,265, ఆలేరులో 2,35,270, జనగాంలో 2,42,771 మంది ఓటర్లు ఉన్నారు. ఏడు నియోజకవర్గాల్లో 2,141పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. ఇందులో 852 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉండగా, 2 వల్నబురల్ పీఎస్‌లను గుర్తించారు. అధికారులు, సిబ్బంది కలిపి 10,140మంది ఎన్నికల విధుల్లో ఉండనున్నారు. ఎన్నికల్లో 8,023 బ్యాలెట్ యూనిట్లు, 2,673 కంట్రోల్ యూనిట్లు, 2,994 వీవీప్యాట్లు ఉపయోగించనున్నారు. సాంకేతిక కారణాలతో ఇబ్బందులు తలెత్తితే అదనంగా 25 శాతం సామగ్రిని అందుబాటులో ఉంచారు. నియోజకవర్గాల్లో పోలింగ్ తీరును వెబ్ కాస్టింగ్ ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షించనున్నారు. యాదాద్రి భువనగిరి కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ యూనిట్ నుంచి మానిటర్ చేయనున్నారు. పోలింగ్ ప్రక్రియ ముగిశాక ఈవీఎంలను భువనగిరిలోని అరోరా ఇంజినీరింగ్ కాలేజీకి తరలిస్తారు. అక్కడ ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ల్లో వాటిని భద్రపరచనున్నారు.

నల్లగొండ : బోయవాడలో ఏర్పాటు చేసిన ఆదర్శ పోలింగ్ కేంద్రం

నల్లగొండ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దాసరి హరిచందన

పోలింగ్ సవ్యంగా జరిగేందుకు కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షించాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరిచందన

నల్లగొండ రూరల్, మే 12 : పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సవ్యంగా నిర్వహించేందుకు జిల్లా స్థాయి అధికారులు కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దాసరి హరిచందన ఆదేశించారు. ఆదివారం ఆమె కంట్రోల్ రూమ్‌ను పర్యవేక్షించి అధికారులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. ఎక్కడ ఎలాంటి ఘటనలు జరుగకుండా వివిధ కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ బృందాలన్నీ కంట్రోల్ రూమ్ నుంచి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ముఖ్యంగా మాన్ పవర్ మేనేజ్‌మెంట్, మాక్ పోలింగ్, వెబ్ కాస్టింగ్ తదితర అంశాలపై దృష్టి సారించాలని తెలిపారు.

ఈవీఎంల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి ఇచ్చే పోలింగ్ శాతం వివరాలను అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా, సెక్టార్ల వారీగా సేకరించి కంట్రోల్ రూమ్ నుంచి పోలింగ్ శాతాన్ని తయారు చేయాల్సిందిగా సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, ఇందుకోసం ఆశ, అంగన్‌వాడీల సహకారాన్ని తీసుకోవాలని చెప్పారు. సమీక్షలో జిల్లా రెవెన్యూ అధికారి డి. రాజ్యలక్ష్మి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఓటు కోసం సొంతూళ్లకు..

సూర్యాపేట అర్బన్, మే 12 : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఓటు వేసేందుకు హైదరాబాద్ వాసులు గ్రామాలకు పయనమయ్యారు. వరుసగా రెండు రోజులు సెలవు రావడంతో ప్రత్యేక వాహనాలతో పాటు ఆర్టీసీ బస్సుల్లో బయల్దేరారు. దాంతో రహదారులు రద్దీగా మారాయి. బస్టాండ్లు జనంతో కిటకిటలాడాయి. అయితే సరిపడా ఆర్టీసీ బస్సులు లేక జనం ఇబ్బంది పడ్డారు. పల్లెలకు వెళ్లేందుకు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒక్కో బస్సుకోసం 3 గంటలు ఎదురుచూడాల్సి వచ్చింది. సమయానికి బస్సులు రాకపోవడం, ఎండ వేడిమి కారణంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండు, హైటెక్ బస్టాండ్‌లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇక ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీతోపాటు, పార్లమెంట్ ఎన్నికలు ఉండడంతో హైదరాబాద్ నుంచి పెద్ద ఎత్తున్న ఓటర్లు తరలివెళ్తున్నారు. శనివారం నుంచి మొదలైన వాహనాల రద్దీ ఆదివారం కూడా కొనసాగింది. హైదరాబాద్–విజయవాడ 65వ జాతీయ రహదారిపై వాహనాలు బారులుదీరి వెళ్లాయి.

సూర్యాపేట కొత్త బస్టాండులో బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

అంతుచిక్కని ఓటరు మనోగతం

- అయోమయంలో అభ్యర్థులు
- అసెంబ్లీ ఎన్నికల నాటి పోలింగ్ అవుతుందా అన్న సందేహాలు
- అప్పటి మెజార్టీ నిలువదన్న భయంలో కాంగ్రెస్ అప్రమత్తం
- ఓటర్ల పునరాలోచనపైన బీఆర్‌ఎస్ అంచనాలు
- మోదీ చరిష్మాపైనే భారం వేసి బీజేపీ లెక్కలు
- నేటి పోలింగ్‌పైనే అందరి దృష్టి

నల్లగొండ ప్రతినిధి, మే12(నమస్తే తెలంగాణ) : సోమవారం ఉదయం 7గంటల నుంచి ఓటర్లు ఓటింగ్ తరలివచ్చేందుకు సిద్ధమైన వేళ కూడా ప్రధాన పార్టీలకు ఓటరు మనసత్వం అంతుచిక్కడం లేదన్నది స్పష్టం. ప్రధాన పార్టీల అభ్యర్థులు సుడిగాలి ప్రచారం నిర్వహించినా అది మెజార్టీ ఓటర్లను ప్రభావితం చేసినట్లుగా కనిపించడం లేదు. గత డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ప్రస్తుతం జరుగుతున్న లోక్‌సభ ఎన్నికలకు పోలికే లేదన్న చర్చ వినిపిస్తున్నది. దాంతో అసలు ఓటరు ఏమనుకుంటున్నాడో అన్నది మిస్టరీగా మారింది. లోక్‌సభ ఎన్నికలను ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నది వాస్తవమే. ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని నల్లగొండ, భువనగిరి లోక్‌సభ స్థానాల పరిధిలో మూడు పార్టీలు వ్యూహాత్మకంగానే రంగంలోకి దిగాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఏకపక్షంగా సాధించిన విజయాలతో రెండు సిట్టింగ్ స్థానాలను తిరిగి నిలబెట్టుకోవాలన్న లక్ష్యంతో కనిపిస్తున్నది. దాంతో ఇక్కడ రెండు స్థానాలను గతంలో మాదిరిగానే రెడ్డి సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులను రంగంలోకి దింపింది. నల్లగొండలో జానారెడ్డి కుమారుడు రఘువీర్‌రెడ్డిని, భువనగిరిలో సీఎం రేవంత్‌రెడ్డి సన్నిహితుడైన చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని పోటీకి నిలిపింది. నల్లగొండ విషయంలో జానారెడ్డికి కుమారుడు కావడంతోపాటు ఇద్దరు మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తుండడంతో వీరికి ప్రతిష్ఠాత్మకంగా మారింది. దాంతో ఇక్కడ ప్రత్యేకంగా దృష్టి సారించారు. సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్‌లపై మంత్రి ఉత్తమ్, మిర్యాలగూడ, నాగార్జునసాగర్, దేవరకొండను జానారెడ్డి, నల్లగొండ అసెంబ్లీని మాత్రం మంత్రి కోమటిరెడ్డి దృష్టి పెట్టారు. సాగర్ ఆయకట్టుతో పాటు ఏఎంఆర్పీ ఆయకట్టులో కరువు, సాగర్‌లో నీళ్లు ఉన్నా ఇవ్వకపోవడంతో రైతుల్లో వ్యతిరేకత, వంద రోజుల్లో హామీల అమలు తదితర అంశాలు వీరిని కలవరానికి గురి చేస్తున్నాయి. దేశంలోనే అత్యధిక మెజార్టీ ఇక్కడి నుంచే అని పైకి అంటున్నా... లోలోపల మాత్రం ఎక్కడో భయం వెంటాడుతున్నది నిజం. ఇక భువనగిరిలో చామల కిరణ్ పెద్దగా గుర్తింపు కలిగిన నేత కాకపోవడంతో రేవంత్‌రెడ్డికి సవాలుగా మారింది. దాంతో అప్పటి వరకు ఇన్‌చార్జిగా ఉన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై నమ్మకం లేక ఆయన సోదరుడు రాజగోపాల్‌రెడ్డికి గెలుపు బాధ్యతలు అప్పగించారు. అయినా భువనగిరిలో విజయంపై నమ్మకం లేక విచ్చలవిడిగా రాజగోపాల్‌రెడ్డి పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించారు. పదేండ్ల నుంచి కష్టపడిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించిన కాంగ్రెస్ క్యాడర్‌కు కొంత నైరాశ్యంలో పడింది. అభ్యర్థిని వెంటేసుకుని రాజగోపాల్‌రెడ్డి సుడిగాలి పర్యటనలు చేసినా ఓటర్ల నుంచి అప్పటిలా స్పందన లేదని ఆ పార్టీ శ్రేణులే చెబుతున్నాయి. ఇవన్నీ ఇలా ఉంటే అసెంబ్లీ ఎన్నికల్లో ఓ వేవ్ లాగా కాంగ్రెస్ అభ్యర్థులకు ఓట్లు పోలయ్యాయి. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపిస్తలేదు. దాంతో ఆయా అసెంబ్లీల వారీగా ఓట్లు తగ్గి మెజార్టీ కూడా భారీగా తగ్గిపోతుందన్న భయం వెంటాడుతున్నది. ఇదే జరిగితే తమ ప్రతిష్టకు ఇది దెబ్బేనని భావిస్తున్నారు. ఇంత ప్రచారం చేసినా ఓటర్ల నాడి అంతుచిక్కక చివరకు ప్రలోభాలకు తెరలేపారు. రెండు చోట్లా ఓటర్ల తాయిలాలు ఎర వేస్తున్నారు. ఒక్కో ఓటుకు 300 నుంచి 500 రూపాయల వరకు పంచిపెట్టారు. దీనికి ఒక క్వార్టర్ అదనం. ఇవన్నీ చేసినా తమకు ఏ మేరకు ఓట్లు తగ్గిపోతాయోనన్న సందేహం ఉమ్మడి జిల్లా పరిధిలోని ఇద్దరు మంత్రులను, మిగతా 9 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను వెంటాడుతున్నది కాదనలేని నిజం. ఇక బీజేపీకి సరైన అభ్యర్థులు లేక ఇద్దరినీ బీఆర్‌ఎస్ మాజీలకే టికెట్లు ఇచ్చారు. భువనగిరిలో మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్‌కు టికెట్ ఇవ్వగా మోదీ చరిష్మాపైనే ఆశలు పెట్టుకున్నారు. ఇక తన సామాజిక వర్గం గౌడ ఓటర్లపైనా దృష్టి సారించారు. నల్లగొండలో బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డిని పిలిచి టికెట్ ఇచ్చారు. ఇక్కడ బీజేపీ పాత్ర నామమాత్రమే కాగా మోదీ పేరుతోనే ఓటర్లను కలిసే ప్రయత్నం చేశారు. ముఖ్యంగా పట్టణాలపై ఎక్కువ దృష్టి పెట్టి పనిచేశారు. కానీ నల్లగొండ, భువనగిరిల్లో సంస్థాగతంగా బీజేపీ అంతంతమాత్రమే కావడంతో ఓటర్లు ఏం చేస్తారన్నది బీజేపీ నేతలకు అంతుపట్టడం లేదు. గతంతో పోలిస్తే తమకు ఓటింగ్‌శాతం పెరుగుతుందన్న ధీమాలో మాత్రం ఉన్నారు.

బీఆర్‌ఎస్‌పై జనం పునరాలోచన

బీఆర్‌ఎస్ భువనగిరిలో బీసీ సామాజికవర్గానికి చెందిన క్యామ మల్లేష్‌ను, నల్లగొండలో కంచర్ల కృష్ణారెడ్డిలను రంగంలోకి దింపింది. అయితే గతంలో జిల్లాలోని 12కు 12 స్థానాల్లో బీఆర్‌ఎస్ ప్రాతినిధ్యం వహించగా ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో 11 స్థానాల్లో ఓడిపోయింది. అప్పుడు ఓ మాయలో పడి బీఆర్‌ఎస్‌ను దూరం చేసుకున్న ఓటరు తిరిగి పునరాలోచనలో పడినట్లుగా బీఆర్‌ఎస్ నేతలు భావిస్తున్నారు. కాంగ్రెస్ తెచ్చిన కరువుతో సాగునీళ్లు లేక తాగునీటి సరఫరా సరిగ్గా కాక కరెంటు కోతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రైతుభరోసా డబ్బులు రాక, చెప్పిన రుణమాఫీ చేయకపోవడంపైనా రైతులు ఆగ్రహం ఉన్నట్లుగా చెబుతున్నారు. ఇక వందరోజుల్లో ఆరు గ్యారెంటీల అమలు కాకపోవడంతో ప్రజల్లో కాంగ్రెస్ విశ్వాసం కోల్పోతుందని అంచనా వేస్తున్నారు. ఎన్నికల ప్రచారానికి వెళ్తే కాంగ్రెస్‌పై రైతులు, సామాన్యుల్లో వ్యతిరేకతతో ఉన్నట్లుగా భావిస్తున్నారు. వీటన్నింటి నేపథ్యంలో ఓటరు తిరిగి కేసీఆర్ వైపు మొగ్గు చూపవచ్చని అంతర్గత లెక్కల్లో తేలుతున్నారు.

ఇలా ఎవరి అంచనాలు, వ్యూహాలు ఎలా ఉన్నా ఇవ్వాల పోలింగ్ ఏ మాత్రం అవుతుందన్న దానిపైనా అందరిలోనూ సందేహాలు నెలకొన్నాయి. నల్లగొండలో 2014లో 79.53 శాతం పోలింగ్ అయితే 2019లో 73.27శాతం అయ్యింది. భువనగిరిలో 2014లో 81.22శాతం కాగా 2019లో 75.11శాతం నమోదైంది. ఇక ఇప్పుడు ఈ మాత్రం అవుతుందా అన్న మీమాంస నెలకొంది. ఎన్నికల ప్రచారంలో ఓటరు స్పందనను బట్టి 70శాతానికి అటు ఇటుగానే పోలింగ్ కావచ్చని భావిస్తున్నారు. ఇదే జరిగితే అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే భారీ తగ్గుదల అవుతుంది. ఈ తగ్గుదల ఎవరికీ లాభం చేస్తుంది? ఎవరికీ నష్టం చేస్తుంది? అన్నది ఉత్కంఠతను రేకెత్తిస్తున్నది.



కనిలాల్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, చిరుమర్తి లింగయ్య తదితరులు

కనిలాల్ నాయక్ అంత్యక్రియలు పూర్తి

- నివాళులర్పించిన మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు

చందంపేట (దేవరకొండ), మే 12 : దేవరకొండ మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ తండ్రి రమావత్ కనిలాల్ నాయక్ అనారోగ్యంతో శనివారం హైదరాబాద్‌లోని కామినేని ఆస్పత్రిలో మృతి చెందిన విషయం విదితమే. ఆదివారం స్వగ్రామమైన దేవరకొండ మండలం శేరిపల్లి గ్రామ పరిధిలోని రత్యాతండాలో కనిలాల్ అంత్యక్రియలు నిర్వహించారు. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డితోపాటు నల్లగొండ జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్, బీఆర్‌ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి కనిలాల్ మృత దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రమావత్ రవీంద్రకుమార్‌ను పరామర్శించి సంతాపం తెలిపారు. మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, భాస్కర్‌రావు, నోముల భగత్ కనిలాల్ పాడె మోశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి, దేవరకొండ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, ఎంపీపీ జాని యాదవ్, జడ్పీటీసీ సురేశ్‌గౌడ్, నాయకులు రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, రాంచందర్ నాయక్, టీవీఎన్ రెడ్డి, హనుమంతు, వెంకటేశ్‌గౌడ్, కిషన్‌నాయక్, బిల్యానాయక్, వడ్త్య రమేశ్‌నాయక్, దేవేందర్ రావు, కంకణాల వెంకట్‌రెడ్డి, లింగారెడ్డి, దస్రూనాయక్, రాజవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.